క్లుప్తంగా

మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఎస్సీకి కేటాయించాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాలరాజ్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మెదక్‌జోన్: రాబోయే ఎన్నికల్లో మెదక్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఎస్సీకి రిజర్వేషన్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాలరాజ్ డిమాండ్ చేశారు. గురువారం పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు దళిత సంఘాలకు చెందిన నేతలతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1952 నుంచి ఇప్పటి వరకు చైర్మన్‌ను ఎస్సీలకు కేటాయించలేదన్నారు. ఇది ఎస్సీలపై చిన్నచూపేనని, రాజకీయంగా ఎదగకుండా జరుగుతున్న కుట్ర అని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నేతలు యాదగిరి, మురళి, రవి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


ప్రారంభిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు నేడు ఇఫ్తార్ విందు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): ముస్లిం సోదరులకు ప్రభుత్వం నేడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిందని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ముస్లిం పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రంజాన్ సందర్భంగా శుక్రవారం సాయంత్రం చేగుంట జుమామసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిందని తెలిపారు. అన్ని గ్రామాల ముస్లింలు పాల్గొనేలా ఇమాంలు, కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నవీన్, షకీల్, అలీ, ఉస్మాన్, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


జోగు జీవన్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): ఉమ్మడి ఏపీ క్రిస్టియన్స్ కోసం తన గళం వినిపించిన పాస్టర్ ప్రగడాల ప్రవీణ్ మరణానికి కారణమైన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని నార్సింగి మండల దళిత సంఘం నాయకుడు జోగు జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నార్సింగిలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సమాజానికి పెద్ద దిక్కుగా నిలిచిన పాస్టర్‌ను హత్యచేశారని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయి విచారణ చేసి పాస్టర్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌తో నష్టపోవద్దు

తొగుట(దుబ్బాక): ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌ల బారినపడి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని తొగుట ఎస్ఐ రవికాంత్ రావు యువతకు సూచించారు. మండలంలోని తుక్కాపూర్‌లో గురువారం పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌లలో నష్టపోయిన అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు. అలాగే నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం, సిబ్బంది పాల్గొన్నారు.


జైరాం తండా వద్ద గుట్టను తవ్వి ..


సామ్లా తండా శివారులో మట్టి తీస్తున్న జేసీబీ


పట్టపగలే టిప్పర్లలో మట్టి రవాణా

మాయమవుతున్న మట్టి గుట్టలు

● అంతారం, సామ్లా తండాల పరిధిలో జోరుగా అక్రమ దందా ● పట్టించుకోని అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలో అక్రమ మట్టి వ్యాపారుల ఆగడాలకు గుట్టలు, కుంటలు, పొలాలు సైతం స్వాహా అవుతున్నాయి.గురువారం సామ్లా తండా శివారులో జేసీబీతో టిప్పర్లలో అక్రమంగా మట్టిని నింపి కొందరు వ్యాపారానికి తరలిస్తున్నారు. అలాగే అంతారం పరిధిలోని జైరాం తండా ప్రధాన రహదారి పక్కనే ఉన్న గుట్టపై మట్టితో పాటు చెట్లు కనిపించకుండా పోతున్న అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వారికి మరింత అనుకూలంగా మారింది. మండల పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన రహదారిపై రాత్రి సమయంలో టిప్పర్లలో మట్టి రవాణా జరుగుతున్నా పోలీసులు వాటిని ఆపకపోవడం ప్రశ్నార్థకం. ఈ విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దార్ సింధూజను వివరణ కోరగా.. మట్టి అక్రమణకు గురైన స్థలాలను పరిశీలించి, వెంటనే తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఎమ్మార్వోకు అప్పగించినట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నాగ్సాన్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాపన్నపేట(మెదక్)

విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ


పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నర్సాపూర్ రూరల్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని నాగులపల్లి కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కోర్పోల్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, కోర్పోల్ నర్సింలు, ఇంద్రసేనారెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం..ప్రాణదానం

నర్సాపూర్ : రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన కార్యకర్తలను ఆయన అభినందించారు.

అంగన్వాడీ చిన్నారులకు పండ్లు..


ప్లేట్స్, పండ్లు అందిస్తున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని గాంధీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు ప్లేట్స్, పండ్లను తహసీల్దార్ మన్నన్ పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆట, పాట ద్వారా బోధన చేస్తున్న టీచర్ నాగరాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్ను వసూలు


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నును ఈ నెల 31 తేదీ వరకు వసూలు చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడటంతో పాటు, పశువులకు, పక్షులకు నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. వారంలో రెండు రోజులు మురుగు కాలువల్లో బ్లీచింగ్‌తో పాటు, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. ఉపాధి పనులకు సుమారు వంద మంది కూలీలు హాజరయ్యేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ రాజ్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పథకం పనులు నిర్వహించే కూలీలు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నశంకరంపేట ఈజీఎస్ ఏపీఓ రాజ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని మడూర్, చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలుకు పలు సూచనలు చేశారు. ఎండ నుంచి కాపాడుకునేందుకు తలకు రక్షణతో పాటు తరచూ మంచినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఏ గోపాల్, ఈసీ సంపత్, సునీత ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కొనసాగుతున్న రిలే దీక్షలు**

నర్సాపూర్: డంప్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 37వ రోజుకు చేరాయి. ప్యారానగర్‌లో డంప్‌యార్డును ఎత్తి వేయాలనే డిమాండ్‌తో నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీక్షలో జేఏసీ నాయకులు జనార్దన్‌గౌడ్, నర్సింహులు, యాదగిరి, రవిగౌడ్, రవి, స్వామిదాస్ తదితరులు దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు.

◆ **లంబాడీల భాష తీర్మానంపై హర్షం**

నర్సాపూర్ : లంబాడీల భాషను రాజ్యాంగంలో చేర్చాలని తీర్మానించడం పట్ల అఖిల భారత బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి సామ్యానాయక్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో అత్యధికంగా ఉన్న లంబాడీల మాతృభాష గోర్‌బోలిని రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలని గురువారం అసెంబ్లీలో తీర్మానించినందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **విద్యార్థులకు బహుమతులు**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ అన్నారు. ఇటీవల మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జన్మదినం సందర్భంగా ఎంఆర్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన బంగ్లావెంకటాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రవళిక(ప్రథమ), శ్రీజ(ద్వితీయ)కు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్‌రావు, ఉపాధ్యాయులు నాగరాజు, విజయ, మాధవి, బీజేపీ నాయకులు సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, సాయిరాం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఎంపీడీఓ రాజిరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల నిరుద్యోగ యువతి, యువకులు రాజీవ్ యువ వికాస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతి, యువకులు పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారమ్‌తో పాటు ఆధార్, పాన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫొటోను జత చేసి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

రాజీవ్ యువ వికాసానికి హెల్ప్‌డెస్క్

కౌడిపల్లి(నర్సాపూర్): రాజీవ్ యువవికాసం కోసం ఎంపీడీఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ బలరాం గురువారం తెలిపారు. ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, ధ్రువపత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. వికలాంగులు దరఖాస్తు చేస్తే వికలాంగుల ధ్రువపత్రం, రైతులు దరఖాస్తు చేస్తే పట్టాదార్ పాస్‌బుక్ సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

రేపు పశువుల సంతకు వేలం

తూప్రాన్: మున్సిపల్ కేంద్రంలో పశువుల సంత వేలంను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కమిషనర్ గణేశ్‌రెడ్డి గురువారం తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు 90006 50076 నంబరును సంప్రదించాలని కోరారు.

3న ఇసుక డంప్ వేలం

వెల్దుర్తి(తూప్రాన్): హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి వెల్దుర్తి గ్రామ శివారులోని ఓ రైతు పొలం వద్ద డంప్ చేసిన 13 ట్రాక్టర్ల ఇసుకను గతనెలలో రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆ ఇసుకను ఏప్రిల్ 3న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనడానికి ఆసక్తి గల అభ్యర్థులు ముందస్తుగా రూ. 2 వేలు డిపాజిట్ చేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి

క్వాలిటీ కంట్రోలర్ జ్యోతి


చెరువు పూడికతీతను పరిశీలిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి పనుల్లో భాగంగా ఏ పనులు చేపట్టినా నాణ్యతగా చేపట్టాలని క్వాలిటీ కంట్రోలర్ జ్యోతి అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని బద్రియా తండాలో హరితవనాలు, జగ్గంపేటలో మట్టి రోడ్డు పనులు, ఫైజాబాద్‌లో చెరువు పూడికతీత, పాంపాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎండలు ఎక్కువయ్యాయని, సమయానికి నీరందించి హరితవనాలను సంరక్షించుకోవాలన్నారు. మట్టి రోడ్డు పనులు కొలతల ప్రకారం చేయించాలని సూచించారు. రైతులు పాంపాండ్‌లు ఏర్పాటు చేసుకుంటే పంటసాగుకు నీటి వసతితో పాటు, చేపలు పెంచుకునే అవకాశం ఉందన్నారు. పనులను పరిశీలించిన వారిలో జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ అరుణ, ఈసీ భగవాన్‌రెడ్డి, టీఏలు సురేశ్, హన్మండ్లు ఉన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు


సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో రమాసహిత వీరవేంకట సత్యనారాయణ స్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో చిలుకూరు బాలాజీ దేవాలయం శివాలయ ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారామ్ మహారాజ్ పూజలు చేశారు. అనంతరం గ్రామ పురోహితుడు బాపూరావ్‌శర్మ ఆధ్వర్యంలో పూజారులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సోమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు.

చెట్లు నరికిన వారిపై చర్యలేవీ?

అఖిలపక్ష నాయకుల డిమాండ్


నరికిన చెట్ల మొదళ్లను చూపుతున్న అఖిలపక్ష నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి జాతీయ రహదారిపై చెట్లను నరికిన ఫంక్షన్ హాల్ యజమానిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండల అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనంతో మండలంలోని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, కాంగ్రెస్ మండల నాయకుడు రాజేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబు, గౌండ్స్వామి, బీజేపీ నాయకులు నర్సింహులు చెట్లు నరికిన ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. వారి వ్యాపారాలైన పెట్రోల్‌పంపుతో పాటు నిర్మాణంలో ఉన్న దాబాకు అడ్డుగా ఉన్నాయనే చెట్లను నరికేశారని ఆరోపించారు. నరికిన చోట మట్టితో కప్పి విచారణకు వచ్చిన అధికారులను, పత్రిక విలేకరులను ఫంక్షన్‌హాల్ యజమాని చంద్రారెడ్డి తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


రేగోడ్ మండల పీఎస్‌లో..


చిన్నశంకరంపేట: పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్‌లు

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసులు అడ్డుకున్నారు. గురువారం పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోయారు.



వరి.. సిరి

మండలంలో బోర్ల కింద ముందస్తుగా వరినట్లు వేసిన రైతులు పంటచేతికి రావడంతో కోతలు ప్రారంభించారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాల వద్దకు చేర్చుతున్నారు. మరోవైపు నీరందక వరి పైరు ఎండుతున్న రైతుల్లో మాత్రం ఈ ధాన్యం రాశులను చూసి ఒకే ప్రాంతంలో ఇంత వ్యత్యాసమా అంటూ ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొల్చారం(నర్సాపూర్)